క్లుప్తంగా

లక్ష్మీనరసింహస్వామికి విశేష పూజలు



పూజలు అందుకుంటున్న లక్ష్మీనరసింహస్వామి

పెద్దతిప్పసముద్రం : పెద్దతిప్పసముద్రంలో స్వాతి నక్షత్రంలో భాగంగా శ్రీ లక్ష్మీ నరసింహస్వామికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివాలయం సేవకులు సనగరం పట్టాభి రామయ్య ఆధ్వర్యంలో ఉత్సవ విగ్రహాలకు వేద పండితులు భక్తిశ్రద్ధలతో అభిషేకాలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

బాధ్యతల స్వీకరణ



డిప్యూటీ ఎంపీడీఓ ఈశ్వరరెడ్డి

తంబళ్లపల్లె : మండల పంచాయతీరాజ్ డిప్యూటీ ఎంపీడీఓగా ఈశ్వర్‌రెడ్డి ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. గతంలోని ఈఓపీఆర్డీ పోస్టును డిప్యూటీ ఎంపీడీఓగా మార్పు చేసినట్లు ఎంపీడీఓ థామస్ తెలిపారు. పంచాలమర్రి పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న ఈశ్వరరెడ్డికి డిప్యూటీ ఎంపీడీఓగా అదనపు బాధ్యతలు అప్పగించారు.

రాష్ట్ర స్థాయి విజేతగా నిలవాలి



క్రీడాదుస్తులు అందజేస్తున్న షూటింగ్ బాల్ అసోసియేషన్ నాయకులు

మదనపల్లె సిటీ : సమష్టిగా ఆడి రాష్ట్ర స్థాయిలో విజేతగా నిలవాలని షూటింగ్‌బాల్ అసోసియేషన్ జిల్లా చైర్మన్ జునైద్ అక్బరీ అన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో జిల్లా షూటింగ్‌బాల్ జట్టుకు దాతల సహకారంతో క్రీడా దుస్తులు అందజేశారు. 26వతేదీ కర్నూలులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో క్రీడాస్ఫూర్తితో ఆడాలన్నారు. విజేతలుగా నిలిచి జిల్లాకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గౌతమి నరేష్, యూసుఫ్, పీడీలు శివశంకర్, మణి, భారతి, లత, మంజుల తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతో ఆరోగ్యం



ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

నిమ్మనపల్లె : పోషకాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కుసుమకుమారి అన్నారు. గురువారం మండలంలోని ముష్టూరులో అంగన్‌వాడీ కార్యకర్తలు గీత, శ్యామలమ్మ, పార్వతి ఆధ్వర్యంలో 8వ రాష్ట్రీయ పోషణ మాసోత్సవాల్లో భాగంగా మహిళలకు ఊబకాయంపై అవగాహన కల్పించారు. నిర్దేశించిన బరువు కంటే అధికంగా ఉన్న మహిళల్లో అనేక అనారోగ్య సమస్యలు వస్తాయన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ దేవకుమారి, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.
ఫోటో ఉంది.

నూతన వ్యవసాయ మార్కెట్ ప్రారంభించాలి



వేలం పాటలను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

ములకలచెరువు : మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌తో ప్రజలకు, రైతులకు ట్రాఫిక్‌తో ఇబ్బంది కలుగుతోందని, దీంతో నూతనంగా ఎక్కడైనా పక్కన మార్కెట్ ప్రారంభించాలని మండల రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం వారు టమాట వేలం పాటలను పరిశీలించారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. రైతుల కోసం ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి రంగారెడ్డి, అంజనప్ప, మల్లికార్జున, రైతులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రామసముద్రం : మండలంలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్ కో ఏఈ మస్తాన్ తెలిపారు. రామసముద్రంలోని 132 కెవి విద్యుత్ సబ్ స్టేషన్లో మరమ్మతుల కారణంగా ఉదయం 8 నుంచి 12 గంటల వరకు మండలంలోని అన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఆయన పేర్కొన్నారు.

జననీ.. శివకామిని.. జయశుభ కారిణి



మదనపల్లె సిటీ: కాత్యాయనీగా లలితాత్రిపురసుందరిదేవి



మదనపల్లె సిటీ : కనకదుర్గగా చౌడేశ్వరి అమ్మవారు




గుర్రంకొండ : పార్వతీదేవిగా దర్శనమిస్తున్న రెడ్డెమ్మతల్లి



గుర్రంకొండ : పార్వతీదేవి అలంకారంలో పోలేరమ్మ



బి.కొత్తకోట: ధనలక్ష్మి అలంకరణలో కాళికాదేవి



కలికిరి: కాత్యాయనిదేవి అలంకరణలో ఎల్లమ్మ



ములకలచెరువు : వారాహి అలంకరణలో వాసవాంబ

- నేత్రపర్వంగా శరన్నవరాత్రి మహోత్సవాలు

మదనపల్లె సిటీ : దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు కనుల పండువగా సాగుతున్నాయి. నాలుగో రోజైన గురువారం అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. దేవాలయాల వద్ద సందడి వాతావరణం నెలకొంది. అమ్మవారి దివ్య మంగళ స్వరూపాన్ని భక్తులు తిలకించి మైమరచిపోయారు. 'జననీ.. శివకామిని.. జయశుభ కారిణి' అంటూ వేడుకున్నారు. తమను చల్లగా చూడాలని, కష్టాలు తీర్చాలని ప్రార్థించారు. మదనపల్లె పట్టణంలోని వాసవీభవన్‌వీధిలోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఉదయం అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. శేష్‌మహల్ ఏరియా, వివేకానందనగర్, నెహ్రూనగర్, మోతీనగర్ కాలనీల నుంచి మహిళలు సారెను ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. అమ్మవారిశాలలో అమ్మవారు అన్నపూర్ణదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కలశ ఆకారంలో అమ్మవారి అలంకరణ భక్తులకు ఆకట్టుకుంది. సేలంకు చెందిన కళాకారులు అమ్మవార్లను ప్రత్యేక అలంకరణ చేస్తున్నారు. వాసవీశ్రీనిధి ఉమెన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చిన్నారుల నృత్యప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు పి.ఓం ప్రకాష్, కార్యదర్శి సతీష్, గిరిధర్, రాజేష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక దేవళంవీధిలోని సోమేశ్వరస్వామి ఆలయంలో శ్రీలలితాత్రిపుర సుందరిదేవి కాత్యాయని అలంకారంలో భక్తులకు అభయమిచ్చారు. అర్చకులు ఫణికుమార్‌శర్మ ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. స్థానిక నీరుగట్టువారిపల్లెలోని చౌడేశ్వరి ఆలయంలో ఉదయం అర్చకులు సతీష్‌శర్మ అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. అమ్మవారిని కనకదుర్గా అలంకారంలో భక్తులకు దర్శనం కల్పించారు. వీవర్స్‌కాలనీ మహిళలు భక్తులకు పసుపు, కంకుమ, గాజులు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు పురాణం చంద్రశేఖర్, కార్యదర్శి బండి వవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. దేవళంవీధిలోని శ్రీ ప్రసన్న వెంకటరమణ స్వామి ఆలయంలో దర్బార్ అలంకారంలో వెంకన్న దర్శనం కల్పించారు. స్థానిక కోర్టు ఆవరణలోని కోర్టులో గంగమ్మకు శాకాంబరి అలంకారం చేశారు. సీటీఎం రోడ్డులోని రాజరాజేశ్వరి ఆలయంలో అమ్మవారిని గాయిత్రిదేవి అలంకారం, బుగ్గకాల్వలోని బాటగంగమ్మ, చిత్తూరురోడ్డులోని శ్రీ కనుమలో గంగమ్మ, సీటీఎంలోని నలవీరగంగమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అలంకారాలతో భక్తులకు దర్శనం కల్పించారు.

పార్వతీదేవి అలంకారంలో శ్రీ రెడ్డెమ్మతల్లి

గుర్రంకొండ : మండలంలోని చెర్లోపల్లెలో వెలసిన శ్రీ రెడ్డెమ్మతల్లి శ్రీ అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. గుర్రంకొండ గ్రామదేవతలైన శ్రీ గంగమ్మ, పోలేరమ్మ, కన్యకా పరమేశ్వరీ అమ్మవార్లు శ్రీ పార్వతీదేవి అలంకారాల్లో భక్తులకు అభయమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవార్లను రంగు రంగుల పుష్పాలు, పట్టుచీరెలు, దివ్యాభరణాలతో శోభాయమానంగా అలంకరించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

కాత్యాయనిదేవి రూపంలో..

కలికిరి : కలికిరి గ్రామదేవత ఎల్లమ్మ కాత్యాయనిదేవి రూపంలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఉదయం అమ్మవారికి అర్చన, పంచామృతాభిషేకం నిర్వహించారు. పార్వతీ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో ప్రతిష్ఠించిన దుర్గాదేవికి నవరాత్రి పూజలు నిర్వహించారు. రాత్రి లలితా సహస్రనామ కుంకుమార్చన చేపట్టారు.

కాత్యాయనిదేవిగా..

రామసముద్రం : మండలంలోని గుంతలపేటలో శ్రీ చౌడేశ్వరి అమ్మవారు కాత్యాయనిదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. మూగ ఎరప్పల్లిలో శ్రీ పటాలమ్మ, గుంతయంబాడి శ్రీ చౌడేశ్వరిదేవి, వాలీశ్వర స్వామి కొండపై వెలసిన శ్రీ పార్వతి దేవి, శ్రీ లక్ష్మీ జనార్ధనస్వామి, తిరుమల రెడ్డిపల్లిలోని మారెమ్మ, ఆర్.నడింపల్లిలోని శ్రీరామాలయం, చెంబకూరులోని శ్రీ గట్టు వెంకటరమణస్వామి తదితర ఆలయాల్లో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అలంకరణలు, కుంకుమార్చనలు ఘనంగా నిర్వహించారు.

వారాహి అలంకరణలో ..

ములకలచెరువు : మండల కేంద్రంలో వెలసిన శ్రీకన్యకా పరమేశ్వరి దేవిని నిర్వాహకులు వారాహి అలంకారంలో అలంకరించారు. ఆర్యవైశ్య మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు.

లలితాదేవి అలంకరణలో..

కేవీపల్లె : మండలంలోని చీనేపల్లెలో వెలసిన శ్రీ రామలింగచౌడేశ్వరి అమ్మవారు లలితాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి దర్శించుకున్న భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

అన్నపూర్ణదేవిగా బోయకొండగంగమ్మ

కలకడ : మండలంలోని కలకడ, గుడిబండ, కోన, కదిరాయచెర్వు, కె.బాటవారిపల్లె గ్రామాల్లోవెలసిన గ్రామదేవత శ్రీచౌడేశ్వరిదేవిని, గుడిబండ గ్రామంలోని శ్రీబోయకొండగంగమ్మను అన్నపూర్ణదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొగటవీరక్షత్రియులు ప్రత్యేక అలంకరణ చేసి, ఖడ్గప ద్యాలు పలికి, అభిషేకం, పూజలు చేశారు.

అర్ధనారీశ్వరీ అలంకరణలో..

పీలేరు : పీలేరులోని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు అర్ధనారీశ్వరీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మోడల్ కాలనీలోని యల్లమ్మతల్లి ఆలయంలో అమ్మవారికి కాత్యాయనీదేవి అలంకరణ, పూజలు నిర్వహించారు. ప్రభుత్వాస్పత్రి ఆవరణలోని రౌద్రాల అంకాలమ్మ అమ్మవారికి కాత్యాయనీదేవి అలంకరణ చేశారు.

ధనలక్ష్మీ అలంకరణలో కాళికాదేవి

బి.కొత్తకోట: స్థానిక కాళికమ్మ ఆలయంలో కాళికాదేవి ధనలక్ష్మీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి ప్రత్యేక పూలు, వెండి ఆభరణాలతో అలంకరించారు. భయదార్లు గొందిఅప్పి భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు. అలాగే జ్యోతిచౌక్‌లో ప్రతిష్ఠించిన దుర్గాదేవిని దర్శించుకున్న భక్తులకు అన్నదానం చేశారు.



మదనపల్లె సిటీ : అమ్మవారిశాలలో వాసవీదేవికి హారతి ఇస్తున్న అర్చకులు



కలకడ : అన్నపూర్ణదేవిగా బోయకొండగంగమ్మ




పీలేరు : కాత్యాయనీ అలంకరణలో రౌద్రాల అంకాలమ్మ



పీలేరు : అర్ధనారీశ్వరీ అలంకరణలో కన్యకాపరమేశ్వరి



కేవీపల్లె : లలితాదేవి అలంకరణలో చౌడేశ్వరిదేవి



రామసముద్రం : గుంతలపేటలో కాత్యాయనిదేవిగా చౌడేశ్వరి అమ్మవారు

ఎస్సీ, ఎస్టీల సమస్యల పరిష్కారానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ మహేశ్వరిభాయ్

కలకడ : ఎస్సీ, ఎస్టీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తహసీల్దార్ మహేశ్వరిభాయ్ అన్నారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు మాట్లాడుతూ గత సమావేశంలో ఇచ్చిన హామీలు ఎంత వరకు అధికారులు నెరవేర్చారని ప్రశ్నించారు. కలకడ ఇందిరమ్మ కాలనీలో గతంలో బడి, గుడి, ఆటస్థలానికి వదలిన స్థలాలను కొందరు ఆక్రమించారని, దీంతో అంగన్‌వాడీ కేంద్రం నిర్మించడానికి కూడా స్థలం కరువైందని అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు అనేకమార్లు విన్నవించినా స్థలం చూపలేదని ప్రశ్నించారు. వెంటనే స్పందించిన తహసీల్దార్ 24 గంటల్లో ప్రభుత్వ స్థలం చూపడం జరుగుతుందని హామీ ఇచ్చారు. గుడిబండ దళితవాడలో మురుగునీరు వెళ్లడానికి డ్రైనేజీకాలువలు ఏర్పాటు చేయాలని సభ్యుడు రమణ కోరారు. అనుభవంలోని ఎస్సీ, ఎస్టీ భూములను అగ్రవర్ణకులాల వారు ఆక్రమించడానికి ప్రయతిస్తున్నారని అన్నారు. రికార్డుల మేరకు పరిశీలించి ఆక్రమణదారులపై చర్యలు తీసుకుటామని తహసీల్దార్ అన్నారు. ఈకార్యక్రమంలో యంఆర్పీస్ జిల్లా ఇన్‌చార్జ్ యం.శ్రీనివాసులు, పీలేరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడిశలపాటి,వెంకట్రమణ, మండలశాఖ అధ్యక్షులు హరినాథ, నాయకులు రెడ్డెయ్య, రజినీ, ఆర్‌యంపి రమణ,అన్నిశాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కొత్త ఆవిష్కరణపై దృష్టి సారించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కాలేజీ డైరెక్టర్ ఎస్.రామలింగారెడ్డి

మదనపల్లె సిటీ : విద్యార్థులు కొత్త ఆవిష్కరణలపై దృష్టి సారించాలని ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీ డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి అన్నారు. గురువారం స్థానిక చిత్తూరు రోడ్డులోని ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీలో స్మార్ట్ ఇండియా హ్యాకథాన్‌పై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతికత ఆధారిత ప్రపంచంలో సృజనాత్మకత, ఆవిష్కరణ ,జట్టు కృషి ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులకు హ్యాకథాన్స్‌ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. జాతీయస్థాయిలో తమ నైపుణ్యాలను ప్రదర్శించడానికి, సమాజం, విస్తృత అభివృద్ధికి దోహదపడే పరిష్కారాలను పెంపొందించుకోవడానికి ఈ అవకాశాన్ని మెట్టుగా ఉపయోగించుకోవాలన్నారు. ఇంటర్నల్ హ్యాకథాన్‌లో చురుగ్గా పాల్గొన్న విద్యార్థులను అభినందించారు. వినూత్నంగా ఆలోచించడం, సహకారంతో పని చేయడం, వాస్తవ ప్రపంచ సవాళ్లను పరిష్కరించేందుకు పరిష్కారాలను రూపొందించడానికి ఇటువంటి వేదికలను ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ రాయుడు, మిట్స్ డీమ్డ్ యూనివర్సిటీ సీఎస్‌సీ విభాగాధిపతి కుసుమ, మహమ్మద్‌రఫీ పాల్గొన్నారు.

దళితుల గ్రామాల అభివృద్ధికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ శివకుమార్

పీలేరు రూరల్ : మండలంలోని అన్ని దళితుల గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామని తహసీల్దార్ ఎం.శివకుమార్ అన్నారు. గురువారం మండలంలోని వేపులబైలు పంచాయతీ బండమీద దళితవాడలో మానవహక్కుల దినం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఏవైనా సమస్యలుంటే అధికారుల దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ డ్రైనేజీ సమస్య, ఏడు విద్యుత్ స్తంభాలు మరమ్మతులకు గురయ్యాయని, షార్ట్ సర్క్యూట్ అవుతున్నాయని తెలిపారు. అలాగే శ్మశాన వాటిక సమస్య ఉందని తెలిపారు. ఈ సమస్యలు పరిష్కరించాలని కోరారు. గ్రామంలో ఆర్‌వో ప్లాంట్ ఏర్పాటు చేయాలని కోరారు. బడబళ్లవంకపై ఫ్లెట్టపర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో రాజేశ్వరి, ఎస్‌ఐ ఎస్.రహీమ్, డాక్టర్ సుబ్రమణ్యం, ఏవో రమాదేవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వరూప, ఆర్‌ఐ మురగయ్య, వీఆర్వో రమణ తదితరులు పాల్గొన్నారు.

పండ్లతోటల పెంపకంపై అవగాహన కల్పించాలి

తంబళ్లపల్లె : గ్రామీణ రైతులకు పండ్లు, పూల తోటల సాగుపై ఉపాధి హామీ సిబ్బంది అవగాహన కల్పించాలని ఏపీఓ అంజనప్ప తెలిపారు. ఉపాధి హామీ కార్యాలయంలో గురువారం మండల టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలు కోరినన్ని పనులు కల్పించాలని పేర్కొన్నారు. కూలీల సంఖ్య పెంచేందుకు చొరవ చూపాలన్నారు. సకాలంలో పనుల కొలతలు తీసుకుని బిల్లులు చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. అక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో మండల టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తత అవసరం



ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాట్లాడుతున్న సీఐ అనీల్‌కుమార్

కలికిరి : ప్రస్తుతం నూతన తరహాలలో ముందుకొస్తున్న సైబర్ నేరాల పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని సీఐ అనీల్‌కుమార్ అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు గురువారం సైబర్ మోసాలు, శక్తి యాప్ తదితరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ విద్యార్థులు సామాజిక మాధ్యమాల ప్రభావంతో పక్కదారి పట్టకుండా భవిష్యత్‌పై దృష్టి సారించి ఉన్నత లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. ర్యాగింగ్, మాదక ద్రవ్యాల వినియోగానికి దూరంగా ఉండాలని సూచించారు. ఆపద సమయాల్లో అత్యవసర సేవలను పొందడంపై అవగాహన కల్పించారు.

క్షయ వ్యాధి రహిత సమాజానికి అందరూ సహకరించాలి

క్షయ వ్యాధి రహిత సమాజ నిర్మాణానికి అందరూ సహకరించాలని మండలంలోని మేడికుర్తి వైద్యాధికారిణి కావ్యగంధ అన్నారు. గురువారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. క్షయ నిర్మూలనలో భాగంగా ప్రతి విద్యార్థి మై భారత్ వాలంటీరుగా సేవలందించడానికి ముందుకు రావాలన్నారు. సీనియర్ ట్రీట్‌మెంట్ సూపర్వైజర్ నాగిరెడ్డి మాట్లాడుతూ మై భారత్ వాలంటీరు పోర్టల్‌లో నమోదు చేసుకున్న వారికి ఆన్‌లైన్‌లో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, టి.బి. రోగులలో కల్పించాల్సిన ఆత్మస్థైర్యం, టి.బి. వ్యాధిని జయించిన వారిని రోల్‌మోడల్‌గా చూపడం వంటి వాటిపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమాలలో ప్రిన్సిపాల్ ఎంవీ విజయభాస్కర్, సీహెచ్ఓ గీత, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



భగవద్గీత పుస్తకాలతో కమిటీ సభ్యులు

మదనపల్లె సిటీ : మదనపల్లె మండలం బసినికొండ, లక్షీపురం, గంగమ్మగుడి, రామాచార్లపల్లె ప్రాంతాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం చేశారు. ప్రచార వాహనం ద్వారా త్రైత సిద్ధాంత భగవద్గీత, ఆధ్యాత్మిక గ్రంథాల గురించి ప్రచారం చేశారు. భగవద్గీత పుస్తకాలను అందజేశారు. ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని, భగవద్గీత గురించి ప్రబోధసేవా సమితి ఇందూ జ్ఞానవేదిక అధ్యక్షులు సురమౌళి తెలిపారు.

రామసముద్రం : త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక దుత్తలూరు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆచార్య ప్రబోధానంద యోగిశ్వరులు రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ ఆధ్యాత్మిక గ్రంథాలను కమిటీ సభ్యులు ప్రచారం చేశారు. మండలంలోని చెంబకూరు, కమ్మవారిపల్లి, నారిగానిపల్లి, ఎలకపల్లి పంచాయతీల్లోని 14 గ్రామాల్లో ప్రచార వాహనంచే త్రైత సిద్ధాంత భగవద్గీత, ఆధ్యాత్మిక గ్రంథాల ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి దుత్తలూరు కమిటీ అధ్యక్షులు ప్రసాద్, సుధాకర్, పెంచల రత్నం, నాగమ్మ, మల్లీశ్వరి, నాగరాజు, వెంకటసుబ్బమ్మ, రమణయ్య, రత్తమ్మ, రమణమ్మ, మధుప్రియ, కొండారెడ్డి, పెద్ద కొండారెడ్డి, మమత పాల్గొన్నారు.

ఇంటింటా ఓటర్ల సర్వే నిర్వహించాలి

కురబలకోట : ఓటర్ల జాబితా కచ్చితత్వం కోసం బీఎల్‌ఓలు ఇంటింటికి (హౌస్ టు హౌస్) వెళ్లి ఓటర్ల వివరాలను ఏకీకృతం గావించి డిజిటల్ యాప్‌లో పొందుపరచాలని తహసీల్దారు ధనుంజయులు సూచించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2002 నుంచి 2025 వరకు కుటుంబాల వారిగా పేర్లు, చిరునామా మార్పులు, మరణించిన వారి పేర్లు తొలగింపు, డూప్లికేట్ ఎంట్రీలు గుర్తించాలన్నారు. ఈపీఐసీ నెంబర్ల మ్యాపింగ్‌ను ప్రాధాన్యంగా తీసుకోవాలన్నారు. యాప్‌లో నమోదు చేయాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో రోజు వారి లక్ష్యాలు సాధించాలని ఎన్నికల సంఘం తక్షణ ఆదేశాలు జారీ చేసిందన్నారు. ప్రతి ఇంటి తలుపు తట్టి డిజిటల్ వెరిఫికేషన్ ద్వారా క్లీన్ లిస్టు రూపొందించాలన్నారు.

క్లాప్ మిత్రలకు వైద్య పరీక్షలు



క్లాప్ మిత్రలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

నిమ్మనపల్లె : స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద స్వచ్ఛతా హీ సేవా, ఏక్ దిన్ ఏక్ గంటా, ఏక్ సాత్ కార్యక్రమంలో భాగంగా గురువారం క్లాప్ మిత్రలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన మందులు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ రమేష్‌బాబు తెలిపారు. అనంతరం కార్యాలయ ఆవరణలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ బాలరాజు, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

గరుడ సేవకు ప్రత్యేక బస్సులు

మదనపల్లె సిటీ : తిరుమల– తిరుపతి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం గరుడసేవ పురస్కరించుకుని తిరుపతికి స్పెషల్ బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ–1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. మదనపల్లె నుంచి 10 ఎక్స్‌ప్రెస్ బస్సులు నడపుతామన్నారు. భక్తులకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పుట్టగొడుగుల పెంపకంతో స్వయం ఉపాధి



పుట్టగొడుగుల పెంపకంపై వివరిస్తున్న కేవీకే ఉద్యాన శాస్త్రవేత్త శ్రీనివాసులు

కలికిరి: పుట్టగొడుగుల పెంపకంతో స్వయం ఉపాధి లభిస్తుందని కేవీకే కో–ఆర్డినేటర్ మంజుల అన్నారు. కేవీకేలో పుట్టగొడుగుల పెంపకంపై గురువారం ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీకే ఉద్యాన విభాగం శాస్త్రవేత్త శ్రీనివాసులు పుట్టగొడుగుల పెంపకానికి వాడే విత్తనం తయారీ, వాటిలో గల పోషక విలువలు, అవసరమైన ముడి సరుకులు, పెంపకం పద్ధతులు, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ, మార్కెటింగ్ తదితరాలపై మహిళలు, వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు వివరించారు. మహిళలు ఇంటి వద్దనే పుట్టగొడుగులు పెంపకం చేపట్టి ఆదాయం పొందవచ్చన్నారు.

వీధి వ్యాపారులకు రుణాలు

మదనపల్లె: మున్సిపాలిటీ పరిధిలో గుర్తించిన వీధి వ్యాపారులకు బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేయడం జరుగుతుందని కమిషనర్ కే.ప్రమీల అన్నారు. గురువారం మెప్మా, బ్యాంకు మేనేజర్లతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. వడ్డీ వ్యాపారులతో నష్టపోకుండా తొలివిడతలో ఇచ్చిన రుణం తీరిపోయాక కొత్తగా అదనపు మొత్తంతో రుణం ఇవ్వడం జరుగుతుందన్నారు. అర్హత కలిగిన వీధి వ్యాపారులు రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మెప్మా సీఎంఎం మధుసూదన్‌రెడ్డి, మేనేజర్లు, ఫీల్డ్ ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.